క్లుప్తంగా

నేడు ఎంపీ పర్యటన

సదుం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మండలంలో ఆదివారం పర్యటిస్తారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బూరగమంద పంచాయతీ రామాపురంలో నూతన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌కు వెంకటేగౌడ


పోలీస్‌స్టేషన్ నుంచి వస్తున్న వెంకటేగౌడ

పలమనేరు: గత ఎన్నికల సందర్భంగా కొలమాసనపల్లి క్వారీ కేసుకు సంబంధించి పూచికత్తు సమర్పించేందుకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శనివారం పలమనేరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక స్టేషన్‌కు వచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని రాబోవు రోజుల్లో కూటమి పాలనకు ప్రజలే తగిన బుద్ధిచెబుతారని పేర్కొన్నారు. ఎంపీపీ రెడ్డెప్ప, విశ్వనాథరెడ్డి, క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, బాగారెడ్డి, చెంగారెడ్డి, దయానందగౌడ, ప్రహ్లాద, ముజ్జు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 331 అర్జీలు

పుంగనూరు: మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 331 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రాము తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 6 నుంచి ఈనెల 8 వరకు 19 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సదస్సుల్లో 331 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిలో 90 అర్జీలను గ్రామస్థాయికి వెళ్లి పరిష్కరించామన్నారు. మిగిలిన 241 అర్జీలను నిర్ణీత గడువులో పరిష్కరిస్తామని, ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రిటైర్డ్ రెస్కో లైన్‌మన్ మృతి


దిలీప్‌కుమార్ (ఫైల్)

కుప్పంరూరల్: రెస్కోలో లైన్‌మన్‌గా విధులు నిర్వహించి ఇటీవల రిటైర్డ్ అయిన దిలీప్‌కుమార్ (60) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. శనివారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో ఇంట్లో ఉన్న సమయంలో గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు పట్టణంలోని ఓ నర్సింగ్ హోంకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దిలీప్‌కుమార్ మృతి పట్ల రెస్కో ఎండీ సోమశేఖర్, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

మృతురాలికి నివాళి


పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని ఎరినాగేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గోపాలప్ప శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఎరినాగేపల్లి గ్రామానికి చేరుకుని గోపాలప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని గాండ్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శరవణ తల్లి జగదమ్మ శనివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గాండ్లపల్లికి చేరుకుని మృతురాలి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సదుం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ హరిబాబు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలసి పిచ్చి మొక్కలు తొలగించారు.

సారా కేసులో నలుగురు అరెస్టు

- 20 లీటర్ల సారా స్వాధీనం

కుప్పంరూరల్: సారా విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. కుప్పం మండలంలో సారా విక్రయిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీనిపై స్పందించిన సీఐ తన సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఆ సమయంలో మోట్లచేను గ్రామానికి చెందిన చలపతి, రాజు, జయమ్మ, కనుమపచ్చార్లపల్లెకు చెందిన మురుగేష్ సారా విక్రయిస్తుండగా గుర్తించి, వారిని అరెస్టు చేశారు. వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు: మండలంలోని పత్రపల్లితాండకు చెందిన రమణానాయక్‌ను అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. మండలంలో సారా వ్యాపారాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా రమణానాయక్‌ను అరెస్టు చేశామన్నారు. అలాగే పాత కేసుల్లో నిందితులైన నరసింహరాజు, రత్నమ్మ, రమేష్‌ను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించామన్నారు. సారా విక్రయిస్తున్న రమణానాయక్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

దుంప తెంచింది!


అమ్మకానికి సిద్ధంగా బంగాళా దుంపలు


పలమనేరులో సాగు చేస్తున్న బంగాళాదుంప

- బంగాళాదుంప ధరలు ఢమాల్
- తుండు ధర రూ.500 మాత్రమే
- రైతులకు తీరని నష్టం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఈ దఫా ఎన్నో ఆశలతో బంగాళాదుంప సాగుచేసిన రైతులకు నష్టాలు తప్పడంలేదు. మొన్నటి దాకా తుండు (46కిలోల బస్తా) రూ.1200 ఉండగా ఇప్పుడు రూ.500కు చేరింది. ఎకరా పొలంలో బంగాళాదుంప సాగుకు రైతులు పెట్టిన ఖర్చు లక్ష దాటగా ఇప్పుడున్న ధరల్లో పంటపెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది. గతేడాది ఇదే సీజన్‌లో తుండు ధర రూ.1,300 దాకా పలికింది. బంగాళాదుంప ఎక్కువగా సాగయ్యే రాష్ట్రాల్లో సీజన్ మొదలు కావడంతో ఉన్నట్టుండి ధరల తగ్గుదలకు కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో రైతులను లక్షాధికారులను చేసే బంగాళాదుంప ఈ దఫా దుంప తెంచి నష్టాలను తెచ్చిపెట్టింది.

పంట ఉత్పత్తి బాగున్నా ధరలు లేవు

ఇక్కడి చల్లటి వాతావరణం బంగాళాదుంప సాగుకు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఏటా సెప్టెంబర్‌లో తొలి అదునుగా, ఆపై నవంబర్‌లో రెండో పంటగా సాగుచేస్తారు. ఈ దఫా ఇక్కడ 1,200 ఎకరాల్లో బంగాళాదుంపను సాగుచేశారు. ఇప్పటికే ఒబ్బుళ్లు జరుగుతున్న పంట ఈదఫా 900 ఎకరాల్లో ఉంది. పంటసాగు సమయంలో తుపానులు, తీవ్రమైన చలి, మంచుతో ఫంగస్ తెగుళ్లు ఎక్కువగా వ్యాపించాయి. ఎర్లీ బ్లైట్, లేట్ బ్లైట్ రోగాల నుంచి పంటను కాపాడేందుకు రైతులు వేలకువేలు పెట్టి క్రిమిసంహారక మందులను వాడి పంటను కాపాడుకున్నారు.

ఆశించిన దిగుబడులు

బంగాళాదుంప సాగుచేసేందుకు ఎకరాకు రూ.లక్షకుపైగా రైతులు ఖర్చు చేశారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, సస్యరక్షణ భారీగానే పెట్టుబడులు పెట్టారు. నాటేందుకు విత్తనపు గడ్డ బస్తా (46కిలోలు) రూ.3 వేల దాకా తెచ్చి నాటారు. ఎకరా పొలానికి 15 బస్తాలకు రూ.45 వేలు, ఎరువులు, కలుపు, క్రిమిసంహారక మందులు, కూలీలు ఇతరత్రా ఖర్చులతో మొత్తం రూ.లక్షకుపైగా పంటకోసం వెచ్చించారు. అయితే ఇప్పుడున్న ధర తుండు రూ.500 గా ఉంది. ఎకరా పొలంలో దిగుబడి 20 బస్తాల దాకా వచ్చింది. దీంతో రైతుకు వచ్చింది రూ.లక్ష మాత్రమే. పంట పెట్టుబడి లక్ష దాకా పెడితే చేతికొచ్చింది అంతే. దీంతో పంట ఒబ్బిడికి కూలీల ఖర్చు, రవాణా చార్జీలు, పంటసాగు కోసం రైతు పడిన కష్టం నేలపాలైంది.

పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పెద్దపంజాణి: మండలంలోని గ్రామ పంచాయతీల్లో శనివారం పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపీడీఓ బాలాజి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆయా కార్యాలయాల వద్ద పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయ, వైద్య ఆరోగ్య, వెలుగు, ఉపాధి సిబ్బంది ర్యాలీలు నిర్వహించి పారిశుధ్య నిర్వహణ చేపడతామని ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య నిర్వహణ గురించి గ్రామస్తులకు వివరించారు. ఏఓ భాస్కర్, పంచాయతీ విస్తరణాధికారి శారదాదేవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు


జవాబు పత్రాలను భద్రపరుస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలో శనివారం జరిగిన నవోదయ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈఓ లీలారాణి తెలిపారు. ఇక్కడి రెండు సెంటర్లలో 359 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 271మంది హాజరైనట్టు తెలిపారు. ఇందుకు పరీక్ష చీఫ్‌లుగా గణపతి నాయుడు, ఈశ్వరప్రసాద్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా బాలసుందరం వ్యవహరించారు.

నవోదయకు 103 మంది హాజరు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ పరీక్షలకు 103 మంది విద్యార్థులు హాజరైనట్లు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ కేశవరెడ్డి శనివారం తెలిపారు. చౌడేపల్లె, సోమల, సదుం మండలాల నుంచి 122 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ నాగరాజ రెడ్డి, సెంటర్ అబ్జర్వర్ శారద పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతం

పుంగనూరు: పట్టణంలోని మూడు ప్రాంతాల్లో నవోదయ పరీక్షలు శనివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్, కొత్తయిండ్లు మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు 588 మంది పరీక్షలు హాజరుకావాల్సి ఉండగా అందులో 543 మంది హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు. అందరి సహకారంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

వేమన పద్యాలు.. నేస్తాలు


విజేత చిన్నారులతో నిర్వాహకులు

పలమనేరు: వేమన పద్యాలు సమాజానికి దారి చూపే నేస్తాలని శతావధాని ఆముదాల మురళి అన్నారు. స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వేమన పద్యాల పోటీలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా వందకు పైగా వేమన పద్యాలను చెప్పిన యాభైమంది పిల్లలకు సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్పాలు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, గోల్డ్ మెడల్స్, పుస్తకాలను అందజేశారు. మరోవైపు ఇదే కార్యక్రమంలో పైనేని బుచ్చయ్యనాయుడు స్మారక పురష్కారాన్ని కర్నూలుకు చెందిన బాలల సాహితీవేత్త డా.హరికిషన్‌కు, బసయ్య స్మారక పురష్కారాన్ని ప్రవచనకర్త గుమ్మడి జయరామిరెడ్డికి అందజేశారు. రామక్రిష్ణప్ప, జీఎస్‌సీ మూర్తి, శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, మొహిద్దీన్, భారతి, జమున, మురళి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

- భార్యాభర్తలకు తీవ్రగాయాలు

పలమనేరు: రాంగ్‌రూట్లో వచ్చిన ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో ఒడిశాకు చెందిన భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం సాయంత్రం పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద జరిగింది. ఒడిశా నుంచి నక్కపల్లి వద్ద కూలీ పనుల కోసం వలస వచ్చిన భార్యాభర్తలు నసీరా బేగం(25), రెహమాన్(30) బైక్‌పై పట్టణంలోకి బయలుదేరారు. ఆ సమయంలో రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ వారి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వారిని చిత్తూరు ఆస్పత్రికి సిఫార్సు చేశారు.

కోలాహలం.. గౌరమ్మ నిమజ్జనం


గౌరమ్మను నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామస్తులు

చౌడేపల్లె: మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ కొత్తపల్లెలో కోలాహలంగా గౌరమ్మ నిమజ్జనం శనివారం చేశారు. గ్రామంలో ఏర్పాటుచేసిన గౌరమ్మకు పూజలు చేసి చివరి రోజున ఇంటింటా పూజలందుకొని భక్తి పారవశ్యాన్ని చాటుతూ నిమజ్జనానికి తరలించారు. నరేన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సురేంద్రబాబు, మాల మహానాడు మండల అధ్యక్షుడు మణి, నేతలు బాల, నరేష్, రవి, భాను, కార్తీక్, రెడ్డి పాల్గొన్నారు.

సీడ్ సర్వేపై అవగాహన కమిటీలు


నాగిరెడ్డిపల్లిలో సీడ్ సర్వేపై అవగాహన

పలమనేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జరుగుతున్న సీడ్ సర్వేపై సంచార జాతులు, కులాల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంబీసీ నాయకులు గడ్డూరు ఉమామహేశ్వర్ తెలిపారు. ఆమేరకు శనివారం నియోజకవర్గంలోని నాగిరెడ్డిపల్లి, జోగిండ్లు, చప్పిడిపల్లిలో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సీడ్ సర్వేలో బీసీ ఏలోని 32 సంచార కులాలకు మేలు చేసే సర్వేపై ఆయా కులాల్లో అవగాహన కల్పించి సర్వేకు సహకరించాలని కోరారు.

నేడు వేమన జయంతి వేడుకలు

పలమనేరు: పట్టణంలోని రంగాపురం సర్కిల్ వేమన విగ్రహం వద్ద నేడు వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు యోగి వేమన చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెంగారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఓబుల్‌రెడ్డి కుమార్తెకు ఆర్థికసాయం, ఉపాధ్యాయులకు సన్మానాలు, వైపీఆర్ క్యాలెండర్ల ఆవిష్కరణ, పేదలకు దుప్పట్ల పంపిణీ, ఆస్పత్రి పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

రెడీ ఒన్..టూ..త్రీ ఫొటో ఓకే!

- ప్రచారానికి మాత్రమే స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్


బ్యానర్ ముందు చెత్తను శుభ్రం చేస్తున్నట్టు ఫొటోకు ఫోజులిస్తున్న కమిషనర్

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్‌లో శనివారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరవుతున్నట్టు చెప్పినా ఎవరూ రాలేదు. దీంతో స్థానిక టీడీపీ నేతలను పిలిపించి చెత్తను శుభ్రం చేస్తున్నట్టు బ్యానర్ ముందు ఫొటోకు ఫోజు ఇచ్చి కార్యక్రమాన్ని జరిపినట్టు జరిపించేశారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం తొలిరోజే ఇలా జరిగితే ఇకపై ప్రతినెలా మూడో శనివారం ఇక జరిగినట్టే ననే మాట వినిపిస్తోంది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

రొంపిచెర్ల: గ్రామాల్లో పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అన్నారు. స్వచ్ఛంద స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెలలో ప్రతి మూడో శనివారం గ్రామాల్లో స్వచ్ఛంద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేసుకోవాలని ముత్యాలమ్మ గుడివీధి, పెద్దమసీదు వీధుల్లో ప్రజలకు డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. రొంపిచెర్ల సచివాలయ కార్యదర్శులు సత్యం రెడ్డి, దశరథశేఖర్‌రెడ్డి, వార్డు మెంబర్లు చిన్న నాగరాజ, లక్ష్మయ్య, మహిళా పోలీస్ ప్రశాంతి పాల్గొన్నారు.

నివాళి


నివాళులర్పిస్తున్న పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: మండలంలోని చింతలవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత దేవేంద్రరెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని చెప్పారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, కవితమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పార్టీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా ప్రెసిడెంట్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు గిరిధర్ రెడ్డి, హరినాథ రెడ్డి, సర్పంచ్ నారాయణ రెడ్డి ఉన్నారు. అదేవిధంగా తాటిగుంటపాలెంకు చెందిన దామోదర్‌రెడ్డి ఇటీవల హఠాన్మరణం చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

త్యాగరాజస్వామి జయంతి వేడుకలు


త్యాగరాజస్వామి జయంతి నిర్వహిస్తున్న నేతలు

పుంగనూరు: పట్టణంలోని త్యాగరాజస్వామి మండపంలో ఆయన జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు రామనాథశర్మతో పాటు యువ గాయకుడు సాయిశివ శ్రావణ్‌లను సన్మానించారు. నాయీబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు భాస్కర్, చిన్నరెడ్డెప్ప, మొగిలప్ప, పెద్దరెడ్డెప్ప, మునిరాజ, గంగాధర్, ప్రతాప్, ప్రకాష్, చంద్ర, సాయిబాబా ఆలయ ధర్మకర్త నాగరాజు పాల్గొన్నారు.

జైభీమ్ క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు


పలమనేరులో..


క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న శంకర్

పలమనేరు: పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్లను స్థానిక ఏపీఎన్జీఓ కార్యాలయం వద్ద శనివారం ఆ సంఘ అధ్యక్షుడు ఆనంద్‌బాబు, కార్యదర్శి జయమ్మ ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘ నేత హరి పాల్గొన్నారు.

జై భీమ్ ఆవిష్కరణ

గంగవరం: జైభీమ్ యూత్ ఫౌండేషన్ న్యూఇయర్ క్యాలెండర్లను ఫౌండేషన్ చైర్మన్ శంకర్, సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని కీలపల్లి, గండ్రాజుపల్లి గ్రామాల్లో శనివారం ఆవిష్కరించారు.

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ..

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏపీ మెడికల్ ఉద్యోగుల సంఘ 2025 క్యాలెండర్ ఆవిష్కరణ శనివారం జరిగింది. ఇందులో స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. మమతారాణి, సంఘ జిల్లా కార్యదర్శి రాధ, విజయకుమారి, సుకుమారి, మాధవి పాల్గొన్నారు.

ఇంటింటికీ క్యాలెండర్ల పంపిణీ

బైరెడ్డిపల్లె: జైభీమ్ క్యాలెండర్లను యూత్ ఫౌండేషన్ చైర్మన్ బి.శంకర్ ఆధ్వర్యంలో పెద్దపురం, బెల్లంమడుగు, పట్నపల్లె, బేలుపల్లె, బురిశెట్టిపల్లె, చిక్కనపల్లె, శెట్టిపల్లె గ్రామాల్లో క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు తులసీరామ్, ధనంజయ, ప్రేమసాగర్, హరి, విజయ్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వి.కోట: తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండల మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా పంపిణీ చేసిన రుణాలకు సంబంధించి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలుగు సంఘాల సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, నేతలు సోము, రాంబాబు, విశ్వనాథ్, శివకుమార్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

పలమనేరు: స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద పట్టణంలోని టీడీపీ శ్రేణులు శనివారం టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ 29వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం, సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

మొదలైన ఇంటింటి కుష్ఠు వ్యాధి సర్వే


కొలమాసనపల్లిలో అవగాహన ర్యాలీ


పుంగనూరు: ర్యాలీ చేస్తున్న డాక్టర్ రంజిత


సదుం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిబ్బంది


రామకుప్పం: ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ పూజిత


బైరెడ్డిపల్లె: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయ్‌చంద్ర

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీ పరిధిలో శనివారం నుంచి ఇంటింటి కుష్ఠు వ్యాధి సర్వే మొదలైంది. ఈ సర్వే ఫిబ్రవరి 2 దాకా జరగనుంది. ఈ సందర్భంగా మండల మెడికల్ ఆఫీసర్ సుధారాణి, సూపర్‌వైజర్ మధు, వైద్య సిబ్బంది, ఆశాలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తిస్తాం

పుంగనూరు: పట్టణంలో కుష్ఠు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు నిర్వహిస్తున్నట్లు ఈస్ట్‌పేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజిత తెలిపారు. శనివారం ఆమె ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుష్ఠువ్యాధి రహిత సమాజాన్ని ఏర్పాటు చేసుకునేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

సదుం: మండలంలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఆదివారం నుంచి నెల రోజుల పాటు సర్వే నిర్వహిస్తామని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గిరీషా, డాక్టర్ చరణ్ తెలిపారు. మండలంలోని ఎస్ఎం పల్లెలో దీనికి సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

రామకుప్పం: మండలంలోని విజలాపురం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో శనివారం వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎల్‌సీడీసీ(లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపు)లో భాగంగా సోమవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేస్తారన్నారు. డా.సాయిశ్రీ, హెల్త్ అసిస్టెంట్ బాలు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించాలి

బైరెడ్డిపల్లె: కుష్ఠువ్యాధి గ్రస్తులను గ్రామాల్లో గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం ఆరోగ్యసిబ్బందికి కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌ఓ అనూరాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.